జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 27-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 380 పేజీలు: 4 వెల : రూ.7

# డ్రగ్స్ వద్దు.. బ్రో

*** మాదక ద్రవ్య రహిత జిల్లాగా సిక్కోలును తీర్చిదిద్దుతాం * సమాజ పరిరక్షణకు డ్రగ్స్ నియంత్రించాలి * గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గంజాయి అడ్డాగా ఉత్తరాంధ్ర * కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈగల్ వ్యవస్థ * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * శ్రీకాకుళం నగరంలో అవగాహన ర్యాలీ**



**శ్రీకాకుళం క్రైం, జూన్ 26(వార్త):** డ్రగ్స్ వద్దు.. బ్రో అంటూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళంలో నిర్వహించిన అవగాహన ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో పాటు పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. మిల్‌జంక్షన్ నుంచి ఆనందమయి ఫంక్షన్ హాల్ వరకు జరిగిన ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళాన్ని గంజాయి, డ్రగ్స్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని, దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు సహకారం అందించాలని కోరారు. సమాజ పరిరక్షణ కోసమే మాదక ద్రవ్యాలపై ఈ ఉద్యమమన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం గంజాయి కేంద్రంగా, అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను డ్రగ్స్ బారి నుండి రక్షించేందుకు "డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ యువనేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రచారం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, 'ఈగిల్' అనే ప్రత్యేక వ్యవస్థను తీసుకువచ్చిందని తెలిపారు. గంజాయి సాగు చేసే రైతులకు కౌన్సెలింగ్ ఇస్తూ, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. మత్తు పదార్థాల వాడకం వల్ల ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, టీచర్లు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు గంజాయి గుట్టలున్న చోట నేడు పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వాడకం వల్ల తల్లిదండ్రులు గౌరవం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కళాశాలలో ఫోకస్ గ్రూపులు ఏర్పాటు చేశామని, ఎవరిపైనా అనుమానం వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ, రవాణా జరుగుతోందని తెలిపారు. డ్రోన్ల సాయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. గత ఏడాదిలో 270 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. రిమ్స్, వైజాగ్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రుల నుంచి గ్రీవెన్స్‌లో కూడా సమాచారం వస్తోందని పేర్కొన్నారు. సరదాగా మొదలయ్యే మత్తు జీవితాన్ని నాశనం చేస్తుందని ఆయన హెచ్చరించారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు కెరీర్‌ను, ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని నాశనం చేస్తాయని యువతకు సూచించారు. డ్రగ్స్ ఎక్కడ కనిపించినా, ఎవరిలోనైనా అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం మీ బాధ్యతన్నారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానందచే ప్రతిజ్ఞ చేయించగా, పోలీస్ శాఖ ఈ ర్యాలీకి ఆధ్వర్యం వహించింది. డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, సీరా రమణయ్యతో పాటు పెద్ద ఎత్తున పోలీసులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## రాకాసి అల.. మింగేసింది!

*** సంద్రంలో బోటు బోల్తా * వేటకు వెళ్లిన ఐదుగురు మత్స్యకారులు * ఒకరు మృతి * గొలుగువానిపేటలో విషాదం**

**సంతబొమ్మాళి, జూన్ 26 (వార్త):** రాకాసి అల ఓ మత్స్యకార కుటుంబంలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ గొలుగువానిపేట గ్రామానికి చెందిన గొర్లి రామారావు(39) అనే మత్స్యకారుడు సముద్రపు వేటకు వెళ్లి గురువారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఎప్పటిలాగే బోటులో మృతుడుతో పాటు మరొక ఐదుగురు మత్స్యకారులు సముద్ర వేటకు గురువారం వేకువజామున బయలుదేరారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా అలల తాకిడికి బోటు బోల్తా పడింది. బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. వారిలో నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. రామారావు ఒడ్డుకు చేరకపోవడంతో మళ్లీ బోటులో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి గాలించారు. రామారావు మృతదేహం నీటిలో తేలి ఉండడాన్ని గమనించి ఒడ్డుకు చేర్చారు. మృత దేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య తులసమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎంపిటిసి చింతల రాజులు, మత్స్యకారులు కోరారు. సంఘటన స్థలాన్ని సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం పరిశీలించారు.



## జిరాయితీ భూమిపై కన్ను

*** 46 సంవత్సరాలుగా సాగుహక్కులో ఉన్న భూమిపై దౌర్జన్యం * సర్వే నెంబర్ మారిపోయినంత మాత్రాన భూమి ఆక్రమణ * పోలీసులు, రెవెన్యూ అధికారులకు బాధితుల ఫిర్యాదు**

**పలాస, జూన్ 26(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో కబ్జాదారుల ఆగడాలు ఎక్కువయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 198/1లో పొందర వీరన్న పాత్రోకు చెందిన 62 సెంట్లు భూమి అతని కుమారులు త్రిలోచన పాత్రో, కోడలు ప్రభావతి పాత్రోల సాగులో ఉంది. 1978లో లండ దండాలు దగ్గర వీరన్న పాత్రో ఈ భూమిని కొనుగోలు చేశారు. అయితే ఈ భూమి సమీపంలో రాజాన సురేష్‌కు డీ పట్టా భూమి ఉంది. ఇటీవల గత ప్రభుత్వ హయాంలో రీసర్వే జరిగిన సమయంలో నెంబర్లు మారిపోయాయి. దీంతో సాగు హక్కు ఉన్న వారు రెవెన్యూ అధికారులకు ఈ విషయమై అర్జీ కూడా పెట్టుకున్నారు. ఈలోగా సురేష్ ఆ భూమి తనదే అంటే కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని త్రిలోచన పాత్రో, ప్రభావతి పాత్రోలు మీడియా వద్ద వాపోయారు. సర్వే నెంబరు మారిపోయినంత మాత్రాన భూమిపై దౌర్జన్యం చేస్తారా.. ఇదెక్కడి న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులను, తహసీల్దారును ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. కాశీబుగ్గ పోలీసులు ఆ భూమి ఉన్న ప్రాంతానికి వచ్చి విచారణ చేపట్టారు. దీనిపై పలాస తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వివరణ కోరగా రాజాన సురేష్ అనే వ్యక్తి డి పట్టా భూమికి ఈ సర్వే నెంబరు వేసి డాక్యుమెంట్లు తయారు చేసి ఉన్నాయని అది చెల్లదన్నారు.



## నేడు జగన్నాథ రథయాత్ర

**శ్రీకాకుళం, జూన్ 26 (వార్త):** జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధమైంది. జగన్నాథ మందిరంలో విగ్రహాలను ఆలయం నుంచి గుండిచా మందిరం వరకూ రథాలపై ఊరేగించనున్నారు. జగన్నాథ, సుబద్ర, బలభద్ర విగ్రహాలకు విశేష పూజల అనంతరం రథంపైకి ఎక్కించి ఊరేగించనున్నారు. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేట, ఇల్లీసుపురం వద్ద పెద్దఎత్తున ఉత్సవాలు జరగనున్నాయి. తొమ్మిది రోజులు పాటు స్వామి వారు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం కూడలిలోని గుండిచా మందిరంలో జులై 5 వరకూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నామని ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా, ఆయన శిష్యులు బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం జగన్నాథ మందిరం నుంచి రథంపై స్వామి వారిని ఊరేగింపుగా గుండిచా మందిరానికి తీసుకువస్తామన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కేసుపురం పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు

**ఇచ్ఛాపురం, జూన్ 26(వార్త):** కేసుపురం పంచాయతీలో చెత్త నుంచి సంపద కేంద్రానికి మంజూరైన నూతన ట్రాక్టర్‌ను మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, నీటి సంఘం అధ్యక్షులు, దక్కత కామేశ్వరరావు, వీఆర్ఓ దున్న శంకర్‌రావు, సర్వేయరు డి.గోపి, కూటమి నేతలు బి. శ్యాంసుందర్, గుజ్జు భీమరాజు, పి.పురుషోత్తం, కె.నరేంద్ర రెడ్డి, ఎన్.హరికృష్ణ, సూర్ హేమ సుందర్,పి. వాసు, బి.తిరుపతి, బి.వెంకటరావు, జి.సింహాద్రి, ఎస్.సావిత్రి పాల్గొన్నారు.




# పాడి రైతులను ఆదుకునేందుకు చర్యలు

**-మూగ జీవాలకు బీమా భరోసా**

**-మంత్రి అచ్చెన్నాయుడు**




**కోటబొమ్మాళి, జూన్ 26(వార్త):** పశుపోషణ రంగాన్ని బలోపేతానికి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా పశు బీమా భరోసా కల్పిస్తున్నామని, ఇప్పటికే పశుబీమా కింద ప్రభుత్వం రూ.103 కోట్లు విడుదల చేశామన్నారు. కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి 1.76 కోట్ల గొర్రెలు, 55 లక్షల మేకలతో కలిపి మొత్తం 2.31 కోట్ల జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 10 వరకు ఈ సామూహిక మందుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రైతులు సంప్రదాయ సాగుకు పరిమితం కాకుండా, లాభసాటి పంటల వైపు దృష్టి సారించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలపై 90 శాతం సబ్సిడీ అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పామాయిల్, కోకో వంటి ఆర్థికంగా లాభదాయకమైన పంటల సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని వివరించారు. అంతర పంటలుగా సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమవుతున్నాయని, ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ఉపాధి హామీ పనులు, రహదారుల అభివృద్ధికి నిధుల విడుదల వంటి అంశాలపై మాట్లాడిన మంత్రి, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కోట బొమ్మాళికి అన్న క్యాంటీన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులకు రూ.200 కోట్లు మంజూరు చేసి, 54 రహదారి పనులు ప్రారంభించామని తెలి పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆగస్టు 15 నుంచి అమల్లోకి రానుందని, వచ్చే నెల నుంచి గ్యాస్ సబ్సిడీ మొత్తాలను వారి ఖాతాల్లో ముందుగానే జమ చేయనున్నామన్నారు.

కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు కంచరాన రాజగోపాల్, టెక్కలి ఉప సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖరరావు, పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సహకార సంఘాల నాయకులు, పశువైద్యులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన మహిళలకే వన్ ధన్ వికాస కేంద్రాలు



**మందస, జూన్ 26(వార్త):** వన్ దన్ వికాస కేంద్రాలు కేవలం మన్యం ప్రాంత గిరిజన మహిళలకే అప్పగించినట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం కొండలోగాం సచివాలయం వద్ద సర్పంచ్ సవర రోజా, ఢిల్లేశ్వరరావు, ఎంపీటీసీ సవర ఢిల్లేశ్వరి అధ్యక్షతన ఎంపీడీవో వై.వెంకటరమణ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జాతీయ గౌరవ వర్ష్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ గ్రామాల అభివృద్దే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని వివరించారు. ఆదివాసీ మహిళలకు మంజూరు చేసిన జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను సక్రమంగా వినియోగించుకోని గ్రామాలను ఐకమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. దర్తీ ఆబ జన్ భగీదరి అభియాన్ ద్వారా గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకే సర్వే జరిపించినట్లు వివరించారు. ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు మెరుగుపరుచుకోవడానికి స్వయం శక్తి సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యులందరికీ అవసరమైన పరపతి సౌకర్యాన్ని ఉన్నతి, శ్రీనిధి తదితర బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ బీవీ హరికృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.జ్యోత్స్న, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు స్వామినాయుడు, ముఖలింగం, ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్ రామలక్ష్మితో పాటు ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వంశధార శివారు భూములకు నీరందించడమే లక్ష్యం

**పలాస, జూన్ 26(వార్త):** వంశధార ఎడమ కాలువ ద్వారా శివారు భూములకు నీరు అందించడమే లక్ష్యమని నీటి సంఘం అధ్యక్షులు గోనప నిరంజన్ వెల్లడించారు. గురువారం ఆయన వంశధార ఎడమ కాలువ పరిస్థితిని అధికారులు సమక్షంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతి చేనుకి నీరు... ప్రతి చేతికి పని నినాదంతో తామంతా ముందుకు సాగుతున్నామని చెప్పారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలంలో రైతులందరికీ సాగునీటి కాలువ ద్వారా సకాలంలో నీరు అందించడం జరుగుతుందని వంశధార ఈఈ శేఖర్, జేఈ రాజశేఖరం, బడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ పారిశుధ్య పనుల బంద్



**-పాడైన పని ముట్లుతో నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు**

**పలాస, జూన్ 26(వార్త):** మున్సిపల్ అధికారులకు అనేక వినతులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో బుధవారం నుంచి పారిశుధ్య కార్మికులు పనులు బంద్ చేశారు. పాడైన పనిముట్లతో కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, బి.కూర్మారావు, నాయకులు సీహెచ్ మురగన్, యం.రవి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే పనులు నిలుపుదల చేశామని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేదాకా నిరసన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కె.ఈశ్వరరావు, పి.బాలకృష్ణ, యస్.రమేష్, యస్.తిరుపతి, ప్రకాష్‌ముఖి, ఢిల్లీ, అమర్, యస్.శంకర్, యస్.గులాబీ, యస్.ఉష, యస్.లక్ష్మి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## రైతులపై భారం తగ్గించడమే లక్ష్యం

**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** రైతుల సాగు ఖర్చు తగ్గించి, దిగుబడులు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గురువారం ఆయన గార మండలం నిజామాబాద్ గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో విత్తనాలు అందడంతో ఖరీఫ్ సాగు జాప్యం లేకుండా సాగుతుందన్నారు. ఇది పంట దిగుబడుల పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తి జ్వాల వందేమాతరం



**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** స్వాతంత్రోద్యమంలో వందేమాతరం భారతీయులకు స్ఫూర్తిజ్వాలగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి డాక్టర్ నిక్కు అప్పన్న, గాంధీ మందిర ప్రతినిధులు, వివిధ రంగాల ప్రతినిధులు పూలమాలలు వేసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం బంకించంద్ర ఛటర్జీ గొప్పతనాన్ని వివరిస్తూ అవధాన పండితులు పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలు ఆలపించారు. విగ్రహ దాత నిక్కు అప్పన్నకు గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మందుల మోహనరావు, డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కొంక్యాన వేణుగోపాల్, మహిబుల్లాఖాన్, నక్క శంకరరావు, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, పెంకి చైతన్యకుమార్, తర్లాడ అప్పలనాయుడు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో గోతులు పూడ్చండి



**ఇచ్ఛాపురం, జూన్ 26(వార్త):** ఇచ్ఛాపురం బస్టాండ్‌లో గ్రామ దేవత సంబరాలు సమయంలో స్వాగత గేటు ఏర్పాటు చేయడంతో పూర్తిగా గోతులమయంగా తయారైందని టీడీపీ టౌన్ ప్రధాన కార్యదర్శి నందిగం కోటి వాపోయారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి, ఆ గోతులను పూడ్చాలని కోరారు.

## రత్తకన్న షాప్‌లో నగదు చోరీ

**ఇచ్ఛాపురం, జూన్ 26(వార్త):** రత్తకన్న గ్రామం, కొలిగాం రోడ్‌లో ఉన్న మహాలక్ష్మి హార్డ్ వెర్ పెయింట్ షాప్ తాళాలను పగలగొట్టి బుధవారం అర్ధరాత్రి దొంగలు షాపు క్యాష్ కౌంటర్లో ఉన్న రూ.95 వేలు దొంగిలించకపోయినట్లు షాప్ యజమాని గిన్ని వాసుదేవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం సహాయంతో ఘటనా స్థలిని క్షుణంగా పరిశీలించారు. మరో రెండు షాప్‌ల తాళాలు కూడా పగులగొట్టి, సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్ కూడా చోరీ చేసినట్టు తెలిసింది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు మందసలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, జూన్ 26(వార్త):** హరిపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యగ్నేశ్వరరావు, మందస ఏఈ ఎల్.యోగి చెప్పారు. 11కేవీ అంబుగాం ఫీడర్ తో పాటు మందస సబ్ స్టేషన్ పరిధిలోని బొగాబంద 11కేవీ ఫీడర్ లకు అనుకుని ఉన్న చెట్లు, కొమ్మలు 27న(శుక్రవారం) తొలగించబడతాయన్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో గల గ్రామాలైన అంబుగాం, తాళ్ళభద్ర, రాణిగాం, లొహరిబంద, కొత్తపేట, ధర్మపురం, కొత్తూరు, గొల్లలపాలెం, కిల్లోయి, చిన్నబరంపురం, బొగాబంద తదితర గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని వారు కోరారు.



## రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ కొనియాడారు. సింగుపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రోటరీ క్లబ్ శ్రీకాకుళం బృందం గురువారం సుమారు ఆరు లక్షల రూపాయల విలువైన పరుపులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు ముని శ్రీనివాస్ బృందం విద్యార్థుల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చడం ద్వారా గొప్ప ఉదారతను చాటుకుందని ప్రశంసించారు. రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శశిభూషణ్, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు ముని శ్రీనివాస్, సెక్రటరీ దూసి సంతోష్, కోశాధికారి సూర్య పసగాడ, సభ్యులు మంత్రి వెంకటస్వామి, ఇతర రోటరీ బృందం, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి శివాజీ



**మందస, జూన్ 26(వార్త):** మందస మండలంలో మాజీ మంత్రి గౌతు శ్యామ సుందరశివాజీ గురువారం పర్యటించారు. నల్ల బొడ్లూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త తెప్పల సుభద్ర ఆరోగ్యం బాలేదని తెలుసుకొని వెళ్లి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాళ్లగురంటిలో గ్రామాన్ని సందర్శించి.. సిరిపురం పీహెచ్సీ డాక్టర్ నాగసాయితో మాట్లాడి జ్వరాల విషయం అడిగి తెలుసుకు న్నారు. మెడికల్ క్యాంప్ మరో నాలుగు రోజులు పొడిగించాలన్నారు. తాళ్లగురంటి గ్రామస్తులు శివాజీతో మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తమ గ్రామానికి అంబులెన్స్ రావడం ఇబ్బందికరంగా ఉందని, మా ఏరియాకి ఒక అంబులెన్స్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. శివాజీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, రట్టి లింగరాజు, సాలిన మాధవరావు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, దేబాసిస్ పండా, మండల లచ్చయ్య, బేసి ఈశ్వరరావు, ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామాల్లో కొనసాగుతున్న వంశధార సాగునీరు సాధన కమిటీ పర్యటన

**మందస, జూన్ 26(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ గ్రామాల పర్యటన కొనసాగుతోంది. ఆయా గ్రామాల రైతులను చైతన్యం చేస్తున్నారు. రాణిగాం రైతులతో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. కల్లేపల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకి ఉపయోగపడే కార్యక్రమన్నారు. బంగారి గిరీశం మాట్లాడుతూ రైతు హక్కుల కోసం పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. రాంప్రసాద్ మాట్లాడుతూ ఒడిశాతో సమస్యలు పరిష్కరించి, ఇచ్ఛాపురం బహుదానది వరకు అందించాలని కోరారు. రాణిగాం రైతులందరూ భవిష్యత్తు పోరాటాలకి మద్దతు పలికారు. వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మథరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావు చౌదరి, వాయలపల్లి మాధవరావు, దుంపల వైకుంఠరావు, ఉగ్రిపిల్లి సోమనాథం, భావన పురుషోత్తం, కొవ్వూరు దాశరథి, గొర్రెల అంజి, రైతులు పాల్గొన్నారు.




# రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలి

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం**



**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి గురువారం తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కేసులు, వీఆర్‌వోలు ఆయన వివిధ రెవెన్యూ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ప్రస్తావించిన అంశాల్లో కొంత మెరుగైనప్పటికీ మళ్లీ ఆ ఫలితాలు కనిపించలేదన్నారు. తహసీల్దార్లు, వీఆర్‌వోలతో ప్రతీ వారం సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. హెచ్‌డీటీ స్థాయిలోనే సమస్య పరిష్కరించాలన్నారు. వీఆర్‌వోలు వివిధ రెవెన్యూ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. రెవెన్యూ సమస్యల పై అవగాహన లేకపోతే విఆర్‌ఓలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ ఆసుపత్రి నిర్మించేందుకు స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని సైనిక సంక్షేమాధికారిని ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఏపీఐఐసీ భూ సమస్యపై చర్చించారు. టవర్స్ ఏర్పాటుకు బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు స్థలం అడగగా, ఇప్పటికే గుర్తించినట్లు తహసీల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. గార మండలంలో డీసీసీబీ, జలుమూరు మండలంలో వైద్య, ఆరోగ్య శాఖ, గార మండలంలో డీఆర్‌డీఏ, ఎచ్చెర్లలో ఆర్టీవో, సరుబుజ్జిలి, రణస్థలం మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలు, శ్రీకాకుళంలో మార్క్‌ఫెడ్, పర్యాటక శాఖకు సంబంధించి భూ సమస్యలపై చర్చించారు. భూమి త్వరగా తీసుకొని నిధులు వృథా కాకుండా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ పెండింగులో ఉన్న మండలాల వారీగా తహసీల్దార్లు, వీఆర్‌వోలతో ఆయన సమీక్షించారు. 22ఏ భూములను తక్షణమే పరిశీలించాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాలను స్వయంగా పరిశీలించి, నిర్మాణాలు ప్రారంభించని వారి జాబితా తయారు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఖర్మయోగి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. సమావేశంలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, డి.పద్మావతి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖాధికారి తీరుతో ప్రాథమికోన్నత పాఠశాలల రద్దు

**- యూటీఎఫ్ ఆరోపణ**



**మందస, జూన్ 26(వార్త):** మందస మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు కావడానికి ముఖ్య కారణం మండల విద్యాశాఖాధికారి అని యూటీఎఫ్ జిల్లా అధ్య క్షుడు లండ బాబురావు దుయ్యబట్టారు. మండలంలో గల వివిధ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ మందస శాఖ మండల విద్యాశాఖ అధికారి ఎం.లక్ష్మణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో గతంలో పది ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం ఒక ప్రాథమికోన్నత పాఠశాల కూడా లేకపోవడం దుర్మార్గమైన చర్యని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని రద్దుచేసి బాలికలను విద్యకు దూరం చేయడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. జిల్లా కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ కొరడాబడి పాఠశాల నుంచి ఇతర పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రవహిస్తున్న ఏరు దాటాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ దాని పరిశీలించకుండా, యూపీ పాఠశాల రద్దు చేయడం సరైనది కాదన్నారు. సరియాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దూరంలో ఉన్న హరిపురం, రంగోయి పాఠశాలలకు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో బాలికలు విద్యకు దూరమవుతారన్నారు. గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హొన్నాలి పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగాలని డిమాండ్ చేయడంతో హొన్నాలి పాఠశాలను తాత్కాలిక ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించడం సరియైన చర్య కాదన్నారు. విద్యా కమిటీలు నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడంతో హొన్నాలి ప్రజలు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవలి మందస మండలానికి బదిలీపై వచ్చిన కొత్త ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందేలా చూడాలని, కొత్త టెక్స్ట్‌బుక్స్ విద్యార్థులందరికీ అందేలా చూడాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకిట్లు అందజేయాలని, ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ప్రైవేట్ యాజమాన్యాలు డ్రాప్ బాక్స్ లో ఉంచకపోవడంతో వారి పేర్లను నమోదు చేసుకోవడంలో జాప్యాన్ని పరిష్కరించాల న్నారు. కార్యక్రమంలో పూర్వపు జిల్లా కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల అధ్యక్షుడు జగదీష్ బడిత్య, కోశాధికారి సోమనాథ్ సిస్టు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**మందస, జూన్ 26(వార్త):** శక్తి యాప్ సద్వినియోగం చేసుకోవాలని శక్తి టీం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.రవికుమార్ కోరారు. బాలిగాంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినిలు, పిల్లలు, ప్రతి ఒక్కరూ ఫోన్‌లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ఓపెన్ చేసి దానిలో ఉన్న ఎమర్జెన్సీ ఎస్ఓఎస్, డయల్ 100, 112, మిస్సింగ్ చిల్డ్రన్, నైట్ సట్లర్స్, ఫ్యామిలీ కౌన్సిలింగ్, రిపోర్ట్ ఇల్లీగల్ యాక్టివిటీస్ పై వాట్సాప్ లో శక్తి యాప్, సేఫ్ ట్రావెల్, శక్తి హెల్ప్ లైన్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హరిపురం జంక్షన్‌లో ఉన్న మహిళలకు యాప్ గురించి అవగాహన కల్పించి, చైతన్యం పరిచారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలని భారీ ర్యాలీని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు ఎస్.మన్మథరావు, బి.కృష్ణ, ఎం.రవిశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, మార్పు కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మామిడి మోహనరావు, సిబ్బంది మురళి, సప్తగిరి, మోహిని పాల్గొన్నారు..

**సారవకోట, జూన్ 26(వార్త):** సారవకోట కేజీబీవీ పాఠశాలలో టెక్కలి శక్తి టీం సభ్యులు శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 112 లేదా ఎస్‌వోస్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడానికి తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## డా.వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డుకు బత్తిని రాజీనామా



**మందస, జూన్ 26(వార్త):** డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్(లక్ష్మీనారాయణ) ప్రకటించారు. హరిపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పచ్చని ఉద్యానంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి నెపంతో విధ్వంసకరమైన కార్గో ఎయిర్ పోర్ట్ ను నిర్మిస్తుస్తోందని వాపోయారు. ఇందుకు నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని పోస్టల్ ద్వారా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపిస్తున్నానని, అంగీకరించిన మరుక్షణమే కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులతో కలసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ వైస్సార్సీపీ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, బెలమర జీవన్, పిచ్చుక కిరణ్, మర్ల సంతోష్ పాల్గొన్నారు.




**నరసన్నపేట, జూన్ 26(వార్త):** గంజాయి మహామ్మారిని కూకటి వేళ్లతో సహా పెకలించాలని, మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. నరసన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు, కార్య కర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.




**పాతపట్నం, జూన్ 26(వార్త):** మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తోందని, వాటి దుష్ప్రభావంతో కుటుంబ వ్యవస్థ కుప్పకూలుతోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం సాయంత్రం పాతపట్నంలో జరిగిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంజీఆర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, పాతపట్నం ఎస్సై బి.లావణ్య, ఇతర మండల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను కట్టడి చేద్దాం

**-ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, ఎంజీఆర్ పిలుపు -వాడవాడలా మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవ ర్యాలీలు -పాల్గొన్న మేధావులు, అధ్యాపకులు, విద్యార్థులు**




**ఇచ్ఛాపురం, జూన్ 26(వార్త):** మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్స వం సందర్భంగా అధికారులు నిర్వహించిన ర్యాలీలో జ్ఞాన భారతి సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ దాసన్నపేట మీదుగా మరలా బస్టాండ్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నం నాయుడు, తహసీల్దార్ వెంకట్రావు, ఎంఈఓ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఎస్ఐ ముకుందరావు, జోహార్‌ఖాన్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యా లకు దూరంగా ఉండాలని, విద్యపై శ్రద్ధ పెట్టి జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి పాఠశాల ప్రిన్సిపాల్ ఐబిపి, హెడ్ మిస్ట్రెస్ రశీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్‌కుమార్ పండా, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

**పలాస, జూన్ 26(వార్త):** మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అందరం కృషి చేయాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా విద్యార్థులు, యువకులు, పెద్దలతో కాశీబుగ్గ పాతబస్టాండ్ నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే విష పదార్థాలన్నారు. వీటి బారిన పడవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో వసంత్‌కుమార్, ఐసీడీఎస్ పీవో కె.పార్వతి, సూపర్‌వైజర్ లత, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.







**సరుబుజ్జిలి, జూన్ 26(వార్త):** గంజాయి మహామ్మారిని కూకటి వేళ్లతో సహా పెకలించి వేయాలని, మాదక ద్రవ్యాల వినియోగంను కట్టడి చేయాలని ఎంపీడీవో పావని తెలిపారు. సరుబుజ్జిలి మండల కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి, మాదక ద్రవ్యాలను సరఫరాతో పాటు యువతకు విక్రయించే అవకాశం ఉందని పోలీస్ సిబ్బంది వాటిని అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు కూటమి నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఎస్సై హైమవతి, పోలీస్ సిబ్బంది, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




**పలాస, జూన్ 26(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణమందు భావనపాడు మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ దుబ్బ రాము నేతృత్వంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాము మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విష పదార్థాలన్నారు. వీటి వినియోగాన్ని అరికట్టేందుకు అందరం కలసికట్టుగా నడుము బిగించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు శ్రీనివాసరావు, మన్మథరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.జనార్ధన్, మాజీ యం.పి.పి సూరాడ మోహనరావు, శ్రీ రామా సేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాదరావు, మత్స్యకార అధ్యక్షులు కాస చలపతి రావు, శ్రీ అభయాంజనేయ కమిటీ అధ్యక్షుడు కోనేరు లోకనాథం నాయుడు, కోశాధికారి కాస సోమశేఖర్ మాజీ ఉప సర్పంచ్ సింగుపల్లి బాలకృష్ణ, సంఘ సభ్యులు కాస ఈశ్వరరావు, సూరాడ లోకనాథం, జామి అనిల్, మద్దు వాసుదేవ్, కాస కుమార్ స్వామి, జోగి ఢిల్లీరావు, లండ మురళి, ఉపాధ్యాయులు, యువకులు, మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ రహిత సమాజం స్థాపనకు కృషి చేయాలి

**- జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి**

**పలాస, జూన్ 26(వార్త):** డ్రగ్ రహిత సమాజం స్థాపనకు కృషి చేయాలని పలాస సివిల్ కోర్ట్ జూనియర్ జడ్జి యు.మాధురి అన్నారు. గురువారం ప్రపంచ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంఘం, న్యాయవాదులు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, పలాస డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. కోర్ట్ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ కూడా మత్తు పదార్థాల నిషేధం, మాదకద్రవ్య వినియోగ నివారణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సీనియర్ న్యాయవాది పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థులను మాదక ద్రవ్యాల రవా ణాకు వినియోగిస్తున్నారని, అపరిచితులను నమ్మరాదనీ, టీనేజ్‌లో ఉండే బాలబాలికలు అప్రమతంగా ఉండాలని, విద్యపై మాత్రమే దృష్టి పెట్టాలని తెలిపారు. పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ కళాశాలలో ఈ డ్రగ్స్ మాఫియా లేకుండా కళాశాల యాజమాన్యం చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏపీపీ రమేష్, సీనియర్ న్యాయవాదులు రాజారత్నం, ఎన్.విశ్వేశ్వరరావు, జి.ప్రభాకర్‌రావు, టి.శ్యాంసుందర్, పి.చిట్టిబాబు, వి.రవి, డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546